

2023లో కాళేశ్వరం నీటితో కళకళలాడుతున్న సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచారం పరిధిలోని రావి చెరువు



ప్రస్తుతం నీళ్లు అడుగంటి రాళ్లు తేలిన రావిచెరువు

# రాళ్లు తేలిన రావిచెరువు!

- ఐదు దశాబ్దాల తరువాత కాళేశ్వరం నీటితో జలకళ
- 350 కిలోమీటర్ల నుంచి తరలివచ్చిన జలసిరి
- నేడు చుక్కనీరు లేక తేలిన రాళ్లు
- ఆందోళనలో సూర్యాపేట జిల్లా రైతాంగం

సూర్యాపేట, మార్చి 9(నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో ఐదు దశాబ్దాలపాటు చుక్క నీటికి నోచుకోని సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచారం పరిధిలోని రావిచెరువుకు మళ్లీ పూర్వపు దుస్థితి ఏర్పడింది. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడంతో 350 కిలో మీటర్ల దూరంలో ఉన్న రావిచెరువుకు 2018-2023 వరకు గోదావరి జలాలు వచ్చాయి. దీంతో ఈ చెరువు జలకళ సంతరించుకున్నది. అలాంటిది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో చుక్క నీరు లేకుండాపోయింది. ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు ఎండిపోతున్నాయి.

**కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరువుఛాయలు**

బీఆర్ఎస్ హయాంలో ఐదేండ్లపాటు కాళేశ్వరం జలాలతో మండు వేసవిలో సైతం అలుగుపోసిన రావిచెరువులో ప్రస్తుతం రాళ్లు తేలుతున్నాయి. చిన్నపాటి విషయాన్ని భూతద్దంలో చూపుతూ కాళేశ్వరాన్ని పండబెట్టడంతో ఏడాది కాలంగా కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. 205 ఎకరాల్లో విస్తరించి ఉన్న రావి చెరువు ప్రస్తుతం ఎండిపోయే దశకు చేరుకున్నది. 2019కు ముందు 50 ఏండ్లపాటు రావిచెరువుకు చుక్కనీరు చేరలేదు. ఎప్పుడో ఒకసారి భారీ వర్షాలు వస్తే 25 శాతం చెరువు నిండటమే గగనం. అలాంటిది 2019 నుంచి వరుసగా జలకళను సంతరించుకోవడమే కాదు అలుగు పోసింది. రావిచెరువు కింద 250 ఎకరాల ఆయకట్టుతోపాటు మండలంలోని మాచారం, పెన్‌పహాడ్, అనంతారం, పొట్లపహాడ్, భక్తళాపురం, ధర్మాపురం, గాజులమల్కాపురం గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. కానీ ప్రస్తుత పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పుడు కొంత మేర నీళ్లు ఉండగా చెరువు కింద సాగుచేస్తున్న పొలాలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి బోరు, బావులు వట్టిపోయాయి. పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ఈ ఏడాది గోదావరి జలాలు రాలే

కేసీఆర్ పూర్తి చేసిన కాళేశ్వరంతో గోదావరి నీళ్లు కాల్వకు వచ్చినయి. నేను నాలుగేండ్లుగా రావి చెరువు కింద కొంత భూమిని కౌలుకు తీసుకొని చేస్తున్నా. ఈ ఏడాది నీళ్లు రాకపోవడంతో చెరువు ఎండిపోతున్నది. చెరువు కింద సాగు చేసిన వరి పొలాలు ఇప్పటికే సగం వరకు ఎండిపోయినయి. పొట్టకు వచ్చిన దశలో ఎండుతుండటంతో కాపాడుకునేందుకు చెరువులోకి పైపులు వేసి నీటిని అందిస్తున్నం. పూర్తి పంట అయ్యేంత వరకు ఆ నీళ్లు కూడా అందుతాయ లేదో తెల్వదు.



**-భూక్య పంతులు, రైతు, గూడెపుకుంట తండా, పెన్‌పహాడ్ మండలం, సూర్యాపేట జిల్లా**


నారాయణపూర్ శివారులోని కాలువలో నీటి ప్రవాహాన్ని ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలిస్తున్న అలీసాగర్ ప్రాజెక్టు ఏఈ ప్రణయ్‌రెడ్డి

# అలీసాగర్ నీళ్లొచ్చినయ్!

### 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన





పొలాలకు చేరిన అలీసాగర్ లిఫ్ట్ నీరు

నవీపేట, మార్చి 9: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో అలీసాగర్ ఆయకట్టుకు సాగు నీరందక పొట్టదశలో ఎండుతున్న పంటపొలాలపై ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన ప్రత్యేక కథనానికి నీటిపారుదల శాఖ జిల్లా స్పందించారు. ఈ మేరకు ఇరిగేషన్ ఎస్ఈ బద్రీనారాయణ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఈఈ బాల్‌రాం అధ్వర్యంలో ఏఈ ప్రణయ్‌రెడ్డి అలీసాగర్ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు. నారాయణపూర్‌లో ఎండుతున్న పంటలకు డీ/50/4 కాలువ ద్వారా సాగునీటిని తరలించారు. నారాయణపూర్ గ్రామ రైతులు సొంత ఖర్చులతో కాలువ పూడికతీత పనులు చేయించుకున్నారు. కాలువ ద్వారా ఈ నెల 30 వరకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని ఏఈ ప్రణయ్‌రెడ్డి తెలిపారు. ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తమ సమస్యలను వెలుగులోకి తెచ్చి, నీటి విడుదలకు చొరవ తీసుకున్న 'నమస్తే తెలంగాణ'కు నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతులు సాగర్, సత్తార్, ప్రభాకర్, రమణారావు, భూమయ్య, ఇతర ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

- **ఎండుతున్న పంటలు.. అన్నదాత భగీరథ యత్నం**


రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఫలితంగా వ్యవసాయ బోర్లు, బావులు వట్టిపోయాయి. పొట్టదశలో ఉన్న వరి పొలాలను కాపాడుకునేందుకు రైతులు యాతన పడుతున్నారు. ఇలా ట్యాంకర్ ద్వారా నీటి తడులు ఇస్తూ రైతు రాజనర్సు భగీరథ యత్నమే చేస్తున్నాడు. - గంభీరావుపేట


జనగామ జిల్లా బచ్చన్నపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

# బచ్చన్నపేటలో అన్నదాతల ధర్నా

బచ్చన్నపేట, ఫిబ్రవరి 9: గోదావరి జలాలతో మండలంలో ఎండుతున్న పంటపొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. గోదావరి జలాలతో మండలంలోని చెరువులు, కుంటలను నింపకుండా ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు నీటి తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. వరిపొలాలు పొట్టదశకు వచ్చాయని, ఇప్పుడు నీరందకుంటే పూర్తిగా ఎండిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. గత తొమ్మిదేండ్లు కేసీఆర్ పాలనలో మండలంలోని చెరువులు, కుంటలు నిండుగా ఉండేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వాటిని నింపాలనే ధ్యాస కూడా ప్రభుత్వానికి లేకుండాపోయిందని మండిపడ్డారు. ఇప్పటికైనా మండలంలోని అన్ని గ్రామాల చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపి రైతులకు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్ చైర్‌పర్సన్ మద్దికుంట రాధ, నాయకులు సిద్ధిరాంరెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, షబ్బీర్, అజీం, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముశిని రాజుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, మధుప్రసాద్, దుర్గాప్రసాద్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.


ఆకేరు వాగులో అక్కడక్కడ నిలిచిఉన్న నీటిని చిన్న చిన్న కాల్వల ద్వారా గుంతలోకి మళ్లిస్తున్న రైతులు

# ఆకేరు వాగులో రైతన్నల నీటిగోస

- నోటికాడి పంట ఎండుతున్నవైనం
- వాగులో నుంచి పారని నీరు
- గుంతల్లో నీరే వంతులవారీగా..
- ఎస్సారెస్పీ నీరివ్వాలని వేడుకోలు

మరిపెడ, మార్చి 9: నోటి కాడికొచ్చిన పంట పొలాలు కండముందే ఎండుతుంటే రైతన్న పడుతున్న గోస అంతా ఇంతా కాదు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఆకేరు వాగు పరీవాహక ప్రాంతంలో తీవ్ర నీటి సమస్య నెలకొన్నది. ఎస్సారెస్పీ నీటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని పురుషోత్తమాయగూడెం, బీచురాజ్‌పల్లి, తండా ధర్మారం, బాల్నిధర్మారం, ఉల్లేపల్లి, భూక్యా తండా రైతులు అవస్థలు పడుతున్నారు. నిరుడు వరద ప్రభావంతో ఆకేరు వాగు పరీవాహక ప్రాంతాల్లోని పంటలు, బావులు, బోర్లు, మోటర్లు కొట్టుకపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం నీరు లేక వాగులో పెద్ద గుంతలను తీసి వంతులవారీగా మోటర్లు పెట్టుకొని పంట పొలాలను కాపాడుకుంటున్నారు. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం నీళ్లతో వేసవిలోనూ చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు, వాగులు, బావులు, బోర్లలో నీరు సమృద్ధిగా ఉండేది. దీంతో ఆకేరు వాగు పరిసర ప్రాంతాలతోపాటు గ్రామాల్లో పంటలు పుష్కలంగా పండేవి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని వాగులోకి విడుదల చేసి తమ పంటలను కాపాడాలని ఈ ప్రాంత అన్నదాతలు వేడుకుంటున్నారు.

### లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతున్నయ్



తండా ధర్మారం శివారులో సుమారు 200 ఎకరాల వరకు ఆకేరు వాగును నమ్ముకొని 42 మోటర్లతో పంటలను పండిస్తున్నారు. కరెంట్ సమస్యతో ఈ ప్రాంతంలో మోటర్లకు ఆటోమేటిక్ స్టార్టర్లతో పంట పొలాలకు నీరందిస్తున్నారు. లోవోల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయి. ఈ రెండు నెలల్లోనే ఒక్కో రైతుకు చెందిన మోటర్ మూడు, నాలుగుసార్లు కాలిపోయినయ్.

**- నాగేశ్వరరావు, మోటర్ మెకానిక్**

### వంతులవారీగా నీళ్లు పారించుకుంటున్నం



ఆకేరు వాగులో నీళ్లు లేక నలుగురైదుగురం కలిసి పెద్ద గుంత తవ్వి మోటర్లు పెట్టి వంతుల వారీగా పంటకు నీళ్లు పారించుకుంటున్నం. లోవోల్టేజీ సమస్యతో కరెంటు సరిగ్గా రాక రెండు నెలల్లోనే మూడు సార్లు మోటర్ కాలింది. ఒక్కసారి మోటర్ రిపేరుకు రూ.3 వేలు ఖర్చవుతున్నది. అసలే నీళ్లకు ఇబ్బందవుతుంటే కరెంట్ సమస్య తలనొప్పిగా మారింది.

**- గుగులోతు లక్ష్మి, రైతు, తండాధర్మారం, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా**


ఎండిన పొలంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌలు రైతు బానోతు పాండు

## కౌలెట్ల ఇయ్యాలె.. అప్పెట్ల తీర్చాలె

### ఎండిపోతున్న పొలంలో గిరిజన కౌలు రైతు ఆక్రందన

చివ్వెంల, మార్చి 9: 'కేసీఆర్ పుణ్యమా అని కాళేశ్వరం నీళ్లొస్తే ఆరేండ్ల సంది భూమి కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్న. ఈ యాసంగిలో కూడా పదకొండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తే నీళ్లు రాక మొత్తం పొలమంతా ఎండిపోయింది' అని చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామ పంచాయతీ ఆవాసం జగన్నాయక్ తండా గిరిజన రైతు బానోతు పాండు ఆవేదన వ్యక్తంచేశాడు. 'రూ.10 లక్షల అప్పు ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి గత యాసంగిలో నీళ్లివ్వలేదని, ఈ సీజన్‌లో నీళ్లురాక 11 ఎకరాలు ఎండిపోయింది. పెట్టుబడులకు సుమారు రూ.4 లక్షలు అప్పు చేసిన. పాత అప్పు రూ.10 లక్షలు కలిపి మళ్లీ రూ.14 లక్షలకు అప్పు చేరింది. మరి భూమి యజమానికి కౌలెట్ల ఇయ్యాలే, అప్పెట్ల తీర్చాలె.. అంటూ రైతు పాండు కంటనీరు పెట్టుకున్నాడు.

- **సర్కార్‌పై అన్నదాత ధర్మాగ్రహం**


సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రికి చెందిన రైతు బట్టుపల్లి సుందరం ఏడెకరాలు కౌలుకు తీసుకొని సాగుచేశాడు. పొట్ట దశకు వచ్చేసరికి నీళ్లు లేక ఆరెకరాల పంట ఎండిపోయింది. దీంతో ఆ రైతు పొలంలో బైక్‌ను తిప్పుతూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండి కూడా నీళ్లివ్వకుండా అన్నదాతల ఉసురుతీస్తున్నారని రైతు మండిపడ్డారు. - మునగాల

# సర్కార్ నిర్లక్ష్యంతో సాగునీటి కొట్లాట


ఎస్సారెస్పీ కాలువ వద్ద రైతుల వాగ్వాదం

చిన్నగూడూరు, మార్చి9: సర్కార్ నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ జలాల కోసం రెండు గ్రామాల రైతులు కొట్టుకున్న ఘటన శనివారం రాత్రి మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. మరిపెడ మండలంలోని ఆర్లగడ్డ తండా నుంచి వెళ్లే డీబీఎం 60 ప్రధాన కాలువ నుంచి 18ఎల్ ఉప కాలువ దుబ్బతండా, బాల్యతండాల మీదుగా చిన్నగూడూరు మండలంలోని విస్సంపల్లి, తుమ్మల చెరువుతండా గ్రామాల చెరువులకు వెళ్తుంది. విస్సంపల్లి, తుమ్మల చెరువు తండా ఆయకట్టు రైతులు కలిసి రూ.70 వేలు ఖర్చు పెట్టుకుని కాలువను బాగుచేసుకున్నారు. తీరా నీళ్లొచ్చే సమయానికి బాల్యతండా వాసులు ఎస్సారెస్పీ కాలువకు అడ్డుకట్ట వేసి తమ నీటిని మళ్లించుకున్నారు. తమ గ్రామానికి కూడా నీళ్లు వదలాలని పలుమార్లు చెప్పినప్పటికీ బాల్యతండా వాసులు వినకుండా తమతో గొడవపడినట్టు విస్సంపల్లి రైతులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేక, సాగు నీటి కోసం గ్రామాల మధ్య కొట్లాటలు తీవ్రతరం కాకముందే నీరందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా పట్టించుకోని వైనం
- ఎడ్లబండిలో తీసుకొచ్చి బిగించుకున్న రైతులు

పర్వతగిరి, మార్చి 9: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఇస్లావత్ తండాలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. దీంతో రైతులే ఎడ్లబండిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి పర్వతగిరి సబ్‌స్టేషన్‌కు చేర్చారు. ఆదివారం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకొచ్చి వారే బిగించుకున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంతోనే ట్రాన్స్‌ఫార్మర్ తోపాటు మోటర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతున్నారు.


సీతారామ ప్రాజెక్టు నిర్మించిన కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ గుంపెన శివారులోని కాలువ వద్ద ఆయన ఫ్లెక్సీకి పాలు, గోదావరి జలాలతో అభిషేకం చేస్తున్న సీతారామ ప్రాజెక్టు నిర్వాసిత రైతులు

# భూములిచ్చిన మాకే తొలుత 'సీతారామ' నీళ్లివ్వాలి

- ఆ తర్వాతే వేరేచోటుకు తరలించాలి
- మాకివ్వకుండా తరలిస్తే ఊరుకోబోం
- అన్నపురెడ్డిపల్లిలో అన్నదాతల నిరసన
- కేసీఆర్ ఫ్లెక్సీకి గోదారి జలాలతో అభిషేకం

అన్నపురెడ్డిపల్లి, మార్చి 9: సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం భూములిచ్చిన తమకే ముందుగా సాగునీళ్లివ్వాలని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలువల ద్వారా చెరువులను నింపాలని, వాటి ద్వారా తమ పంట పొలాలకు నీళ్లందించాలని కోరారు. ఈ మేరకు సీతారామ కాలువ నిర్మాణానికి భూములిచ్చిన రైతులు నల్లబ్యాడ్జీలు ధరించి అన్నపురెడ్డిపల్లి మండల గుంపెన గ్రామ శివారులోని సీతారామ కాలువ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రాజెక్టు కాలువ కోసం భూములు కోల్పోయిన తమకు ప్రస్తుత ప్రభుత్వం సాగునీళ్లివ్వడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. లింక్ కెనాళ్లతో ఇతర జిల్లాలకు తరలిస్తే ఊరుకోబోమని స్పష్టంచేశారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు వేముల హరీశ్, మామిళ్లపల్లి రామారావు, వెంకటేశ్, ప్రవీణ్, గోపాలరావు, కిరణ్, సుధాకర్, చిరంజీవిరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

**కేసీఆర్ ఫ్లెక్సీకి అభిషేకాలు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టును నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామని అన్నపురెడ్డిపల్లి మండల రైతులు కొనియాడారు. ఈ మేరకు నిరసన దీక్షాశిబిరం వద్ద కేసీఆర్‌కు రైతులందరూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం, గోదావరి జలాలతో అభిషేకం చేశారు. 'జై కేసీఆర్', 'జైజై కేసీఆర్' అంటూ రైతులు చేసిన నినాదాలు మిన్నంటాయి.

**MSME-TOOL ROOM, HYDERABAD**
**(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)**
(A Government of India Society Ministry of MSME)
**Balanagar 'X' Roads, Hyderabad - 500 037 (TS) INDIA**
**VACANCY NOTIFICATION (Temporary contract basis)**
"Positions for CNC **Maintenance Mechanical Engineer**; CNC **Maintenance Electrical Engineer**; Operators:- CNC **Lathe**; CNC **Cylindrical Grinding**; CNC **EDM / Wire-Cut**; CNC **Milling**; CNC **5axis**; NC **Surface Grinding**; Tool makers; **Tool Fitters**, PPC / **Production Engineer**, CMM **Operator / Quality Inspection**".
**Date of Interview : 19th March 2025**
Candidates fulfilling the eligibility criteria may step-in for interview on the date mentioned with latest Resume with photo, original documents & one set self-attested photocopies of all educational, experience certificates.
For detailed advertisement visit **citdindia.org**
Sd/-
**PRINCIPAL DIRECTOR**